సాక్షి ప్రకాశం
శుక్రవారం । 3 । జనవరి । 2025





**అనాథలకు అన్నీ తానై..**
మానవ సేవే మాదవ సేవగా భావించి ఓ వ్యక్తి తన జీవితాన్ని అనాథలకు అంకితం చేశాడు. గిద్దలూరులో అనాథ ఆశ్రమాన్ని స్థాపించి అందరి మన్ననలు పొందుతున్నాడు. - 8లో..



**ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ**
ప్రయాణికురాలు పొగట్టుకున్న నగదు ఉన్న పర్సును తిరిగి అందజేసి ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ చాటుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/21

**వాతావరణం**
ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించొచ్చు

**ఒంగోలు సిటీ:** ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశం పొందిన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఏ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.25 అపరాధ రుసుంతో 8వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో 9వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. అదే విధంగా తత్కాల్ అపరాధ రుసుంతో పదో తరగతికి రూ.500, ఇంటర్మీడియెట్‌కు రూ.1000లతో ఈ నెల 10వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. జిల్లాలోని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు తమ స్టడీ సెంటర్‌లలో ప్రవేశం పొందిన అభ్యర్థులతో పరీక్ష ఫీజును ఏపీ ఆన్‌లైన్ సేవా కేంద్రం లేదా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా నేరుగా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

### ఆక్వా షాపులను పక్కాగా తనిఖీ చేయాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



ఆక్వా సాగుపై సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

**ఒంగోలు అర్బన్:** ఆక్వా షాపులను ప్రతి బుధవారం క్రమం తప్పకుండా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పక్కాగా తనిఖీలు చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. ప్రకాశంభవనంలో గురువారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వా రైతులు వినియోగించే రసాయనాలు, యాంటిబయోటిక్స్ నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటిపై ఆక్వా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆక్వా రంగంలో ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేసే క్రమంలో నిషేధిత యాంటిబయోటిక్స్ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని జరిమానాలు విధించాలన్నారు. సమావేశంలో మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, డ్రగ్ కంట్రోల్ అధికారి, ఫుడ్‌సేఫ్టీ అధికారి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### సిడాప్ డీఆర్‌పీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఒంగోలు వన్‌టౌన్:** సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్ ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ పథకం కింద జిల్లా రిసోర్సు పర్సన్‌ల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ టి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలానికి ఒక డీఆర్‌పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. వీరికి ఇన్సెంటివ్‌లు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 91543 95862 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# నిషా వేడుక

**న్యూ ఇయర్ వేడుకల్లో** లిక్కర్ భారీ కిక్కునిచ్చింది. కూటమి ప్రభుత్వం అర్ధరాత్రి వరకూ మద్యం షాపులకు అనుమతినిస్తే అధికార పార్టీ చేతుల్లో ఉన్న దుకాణాల్లో 24/7 అన్నట్టుగా మద్యం అమ్మకాలు సాగాయి. ఒక్క రోజులోనే 21,184 కేసుల మద్యం తాగించి ప్రజల నుంచి ప్రభుత్వం రూ. కోట్లు లాగేసుకుంది. కొత్త సంవత్సరం సందర్భంగా సుమారు రూ. 13 కోట్ల మేర అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ లెక్కలు ప్రకారం తెలుస్తోంది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో అత్యధికంగా విక్రయాలు జరిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది కంటే జిల్లా వ్యాప్తంగా 142 శాతం మద్యం విక్రయాలు జరిగినట్టు తెలుస్తోంది.



- న్యూ ఇయర్ సంబరాల్లో రూ. 13.20 కోట్ల మద్యం విక్రయాలు
- 21,184 కేసుల మద్యం అమ్మకాలు
- ఒంగోలు నగరంలో రికార్డు స్థాయిలో విక్రయాలు
- ప్రభుత్వం అర్ధరాత్రి 12 వరకు అనుమతిస్తే సిండికేట్లు 24/7 అమ్మకాలు
- పల్లెల్లో బెల్టుషాపులదీ అదే తీరు
- నిరుపేద, సామాన్య ప్రజలపై కూటమి మద్యం పడగ

ఒంగోలు టౌన్:

జిల్లా ప్రజలను మద్యంలో ముంచెత్తించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికింది కూటమి ప్రభుత్వం. కొత్త సంవత్సర వేడుకుల్లో మద్యం ఏరులై పారింది. రెస్టారెంట్ల తరహాలో మద్యం దుకాణాల్లో బల్లలు ఏర్పాటు చేసి మరీ మద్యం విక్రయాలను కొనసాగించారు. అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లవారే దాకా కొన్ని మద్యం దుకాణాలు తెరిచే ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం బెల్ట్ షాపుల్లో కూడా రాత్రి పగలు తేడా లేకుండా మద్యం విక్రయించారు. ఈ ఒక్క రోజులో ప్రజల చేత 21,184 కేసుల మద్యం తాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో కనీసం ఒక్క రూపాయి కూడా జిల్లా ప్రజలకు ఇవ్వలేదు. కానీ మద్యం రూపంలో కోట్ల రూపాయలు మాత్రం వారి జేబుల నుంచి తీసుకుందని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

**ఒంగోలులో భారీగా విక్రయాలు...**

జిల్లా కేంద్రమైన ఒంగోలులో డిసెంబర్ 30, 31 తేదీల్లో భారీగా మద్యం విక్రయాలు జరిగాయి. గత ఏడాది కంటే 107.87 శాతం మద్యం విక్రయాలు అధికంగా జరిగి రికార్డు సృష్టించింది. గత ఏడాది ఒంగోలులో లిక్కర్ 1,133 కేసులు, బీర్ 386 కేసులు విక్రయాలు జరగ్గా ఈ ఏడాదిలో రెట్టింపులో జరగడంతో ఎక్సైజ్ శాఖ అధికారులే ఆశ్చర్యానికి లోనవుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీన 2,671 లిక్కర్, 713 బీరు కేసులు విక్రయాలు జరిగాయి. రెండో రోజు డిసెంబర్ 31వ తేదీన 1,532 లిక్కర్, 678 బీర్ కేసులు అమ్మకాలు జరిగాయి. అంటే గత ఏడాది చివరలో కేవలం రెండు రోజుల్లో 4,203 కేసుల లిక్కర్, 1,391 కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయన్నమాట. 2,253 లిక్కర్, 319 బీర్ కేసుల అమ్మకాలతో సింగరాయకొండ రెండో స్థానంలో నిలిచింది. చీమకుర్తి 1,717 కేసుల లిక్కర్, 530 కేసుల బీర్ విక్రయాలు జరిగాయి. పొదిలిలో 1438 లిక్కర్ కేసులు, 160 బీర్ కేసులు , దర్శిలో 1650 లిక్కర్, 505 బీర్, మార్కాపురంలో 1276 లిక్కర్, 533 బీరు కేసుల అమ్మకాలు జరిగాయి. కనిగిరిలో 1507 లిక్కర్, 304 బీర్ కేసులు, కంభంలో 1048 లిక్కర్, 272 బీరు, యర్రగొండపాలెంలో 1,435 లిక్కర్, 255 బీర్ కేసులు విక్రయాలు జరిగాయి. ఇక జిల్లాలో గిద్దలూరులో తక్కువ విక్రయాలు జరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. 943 కేసుల లిక్కర్, 357 కేసుల బీరు అమ్మకాలు జరగడం గమనార్హం.

**రూ.13.20 కోట్ల మద్యం తాగించి..**

జనవరి వేడుకలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వం జిల్లా ప్రజల చేత కోట్ల రుపాయల మద్యాన్ని తాగించింది. జిల్లాలో మొత్తం 10 ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. ఈ పది సర్కిళ్ల పరిధిలో 21,184 కేసుల మద్యాన్ని విక్రయించింది. ఇందుకు గాను కేవలం ఒకే ఒక్క రోజులో రూ. 13,20,56000లను ఖాళీ చేసింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 142 శాతం అధికంగా మద్యం విక్రయాలు జరిగాయి.

**తెల్లవారేదాక విక్రయాలు...**

కొత్త సంవత్సరం సందర్భంగా మద్యం దుకాణాల సమయాలను సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. డిసెంబర్ 31, జనవరి 1వ తేదీ రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలు జరపుకునే వెసులుబాటు కల్పించింది. అయితే కొందరు మద్యం దుకాణాల యజమానులు తెల్లవారే దాకా వ్యాపారం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరుపుతున్నా అధికారులు జోక్యం చేసుకోకుండా చోద్యం చూశారు. జిల్లాలోని మద్యం దుకాణాల లైసెన్సుదారులంతా అధికార పార్టీకి చెందిన వారే కావడంతో చర్యలు తీసుకోడానికి జంకారు.



ఒంగోలులో డిసెంబర్ 31వతేదీ అర్ధరాత్రి తరువాత వైన్ షాపుల వద్ద మందుబాబులు

**171 మద్యం దుకాణాలు...**
**2500కు పైగా బెల్టు షాపులు...**

జిల్లాలో 171 మద్యం దుకాణాలకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేసింది. షాపులన్నీ తెలుగు తమ్ముళ్లకే దక్కేలా ప్లాన్ చేసింది. దాంతో మద్యం దుకాణాలపై కన్నేసిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ్ముళ్ల పేరుతో దుకాణాలను చేజిక్కించుకుంది. కొన్ని దుకాణాలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, ఇతరులకు దక్కాయి. అయితే ఈ దుకాణాలను నిర్వహించుకునేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు పెద్ద మొత్తంలో నెలవారీ కమీషన్ డిమాండ్ చేసినట్లు ప్రచారం జరిగింది. లేకపోతే దుకాణాలు నిర్వహించకుండా ఇబ్బందులు పెడతామన్న హెచ్చరికలు జారీ అయ్యాయని కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో లైసెన్సు పొందిన మద్యం వ్యాపారులు ఊరూరా బెల్టు షాపులు తెరిచారు. జిల్లాలో సుమారు 2500 బెల్టు షాపులు ఉన్నట్లు ఒక అంచనా. దాంతో జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది.

**నిరుపేదలకు నష్టం ఎక్కువ..**

నిజానికి దిగువ మధ్య తరగతి, నిరుపేద సామాన్య ప్రజలే ఎక్కువగా మద్యానికి బానిసలుగా తయారవుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. రోజంతా కష్టపడి కూలి డబ్బులను మద్యానికి తగలబెట్టేస్తున్నారని కొందరు మహిళలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మద్యం విక్రయాలను కట్టడి చేసేందుకు ప్రయత్నించింది. మద్యం దుకాణాలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకొచ్చి విడతల వారీగా నిషేధం విధించాలని భావించింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆదాయ మార్గంగా మద్యం వ్యాపారాన్ని ప్రైవేటుపరం చేసింది. కోట్ల రూల మద్యాన్ని విక్రయిస్తూ పేదల బతుకులు దుర్భరం చేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



స్థాయి సంఘాల సమావేశంలో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

**ఒంగోలు సిటీ:** జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేల సహకారంతో జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. పాత జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఛాంబర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. సమావేశంలో 5వ కమిటీకి మారెడ్డి అరుణ, 6వ కమిటీకి చుండి సుజ్ఞానమ్మ అధ్యక్షత వహించారు. 2వ స్థాయి సంఘంలో గ్రామీణాభివృద్ధి శాఖ విషయాలపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్ష చేశారు. జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి నిర్వహణలో జరిగిన సమావేశానికి దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 31 లోగా సదరం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయాలి

**ఒంగోలు అర్బన్:** చక్రాల కుర్చీలో ఉండి, మంచానికే పరిమితమై నడవలేని స్థితిలో ఉండి రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 31వ తేదీ లోగా పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, సెర్ప్ శాఖల ప్రధాన కార్యదర్శులు జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకానికి సంబంధించిన జిల్లా స్థాయి అధికారులతో ప్రధాన కార్యదర్శులు వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఉన్నతాధికారులు మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లు పరిశీలించేందుకు స్పెషలిస్టు వైద్యులతో బృందాలను ఏర్పాటు చేసి పూర్తి చేయాలన్నారు. అనర్హులను గుర్తించేందుకు మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, జీజీహెచ్ సూపరింటెండెంట్ జమున, డీసీహెచ్‌ఎస్ సూరిబాబు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

## గోవింద నామస్మరణతో మార్మోగిన శ్రీగిరి



శ్రీగిరి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

**ఒంగోలు మెట్రో:** పుష్యమాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక శ్రీగిరి పాదపీఠం వద్ద ఉన్న బాపూజీ గోశాలలో గోపూజ నిర్వహించి వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గోవింద నామాలు చదువుతూ గరుడ హనుమాన్ శంకు చక్ర త్రిపుండ్రాలను చేతబట్టి భజంత్రీల మేళతాళాలతో స్థానిక కోర్టు సెంటర్ గ్రంథాలయం, కేశవస్వామిపేట భగీరథ మహర్షి మందిరం, వేప అంకమ్మ తల్లి ఆలయం, శర్మ కాలేజీ క్రికెట్ గ్రౌండ్ మీదుగా గద్దలగుంట రాజా పానగల్ వీధులు దాటి శ్రీగిరి చేరి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం, సహ కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు ధనిశెట్టి రామునాయుడు, దోగిపర్తి మల్లికార్జునరావు, స్వామి రాఘవేంద్రరావు, గ్రంధి సుధీర్, బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, తాతా ప్రసాదు తదితర భక్తులు పెద్ద సంఖ్యలో మహిళలు శ్రీగిరి గిరి ప్రదక్షిణ లో పాల్గొన్నారు.

## డ్రోన్లతో నేరాలకు చెక్

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ఎస్పీకి డ్రోన్ అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ కాసు వెంకటేశ్వరరెడ్డి

**ఒంగోలు టౌన్:** జిల్లాలో నేరాలను కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలతో పాటుగా డ్రోన్ కెమెరాలను విరివిగా ఉపయోగించనున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. నూతన సంవత్సరంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు చెక్ పెడతామని చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కొనకనమిట్ల మండలం బచ్చలకూరపాడు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ కాసు వెంకటేశ్వరరెడ్డి జిల్లా పోలీసులకు గురువారం డ్రోన్ బహూకరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్మార్ట్ పోలీసింగ్ విధానంతో ముందుకు వెళుతున్న ప్రకాశం పోలీసు శాఖకు సామాజిక బాధ్యతతో డ్రోన్ బహూకరించిన వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రద్దీగా ఉండే జంక్షన్లు , లా అండ్ ఆర్డర్, నేర నియంత్రణలను పర్యవేక్షించడానికి డ్రోన్ కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. దొంగలను గుర్తించడం, పారిపోతున్న వారిని ఛేజ్ చేయడం, బందోబస్తులు, జాతరలు, ఊరేగింపులు సమయంలో జన సమూహాన్ని పర్యవేక్షించడం సులువవుతుందన్నారు. పోలీసులు భౌతికంగా వెళ్లలేని ప్రదేశాలకు డ్రోన్లను పంపించి అక్కడి పరిస్థితులను సమీక్షించుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రస్తుతం 12 డ్రోన్లు ఎగరవేస్తున్నామని, త్వరలోనే జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రోన్లు ఎగరేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ, పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల ఎస్సై రాజ్‌కుమార్, తర్లుపాడు ఎస్ఐ బ్రహ్మనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించండి



బంగారు బాల్యం కార్యక్రమంపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు అర్బన్:** బంగారుబాల్యం కార్యక్రమం విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పిల్లల ఉత్తమ భవిష్యత్‌కు కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశంభవనంలో బంగారుబాల్యం కార్యక్రమంపై గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి స్కూలులో నోడల్ ఆఫీసర్లను నియమించాలన్నారు. డ్రాపౌట్స్‌ను తిరిగి పాఠశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు ఇమ్యూనైజేషన్ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశంలో బాలల సంరక్షణ అధికారి దినేష్‌మార్, ఐసీడీఎస్ పీడీ హన్సుజన్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, డీపీఓ, డీసీపీఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించాలి




మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

- డీఈఓ కిరణ్‌కుమార్

**ఒంగోలు సిటీ:** విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్ అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం డీఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా పరిధిలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలకు చెందిన 41 మంది ఉపాధ్యాయులకు స్కౌట్స్ మాస్టర్లుగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సేవా దృక్పథం అలవర్చి క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తయారు చేసేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు మీ పాఠశాలలో స్కౌట్రూప్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలన్నారు. ఈ శిక్షణ ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. అందరూ అంకితభావంతో కొత్త విషయాలు నేర్చుకోవాలని, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బలోపేతానికి జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావు, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ తన్నీరు బాలాజీ, రాష్ట్ర రిసోర్సుపర్సన్లుగా నారాయణ, శివనాగిరెడ్డి, జిల్లా ట్రెజరర్ పి.వెంకటరావు, ట్రైనింగ్ కమిషనర్ శేషారావు, రిసోర్సుపర్సన్ రాము తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్:

మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ మహిళా పోలీసు అసోషియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. సైబర్ క్రైమ్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, చిన్నారులపై జరిగే అకృత్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానంగా సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తత చేయాలన్నారు.

కార్యక్రమంలో మహిళా పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆత్మూరి కరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల యామిని, రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ ప్రణతి, అసోసియేషన్ సభ్యులు షేక్ షాహినా, కె. జ్యోతి, అనూష, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



మహిళా పోలీసు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సంతమాగులూరు మండలం పాతమాగులూరు వద్ద చోటుచేసుకుంది. ఎస్సై పట్టాభిరామయ్య వివరాల మేరకు.. నరసరావుపేటకు చెందిన రంగా శివ (30) స్కూటీపై సంతమాగులూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న పాల వాహనాన్ని గమనించక ఢీకొట్టాడు. స్కూటీ లారీ వెనుకవైపు దూసుకు పోవడంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శివ మృతదేహం

# అనాథలకు అన్నీ తానై!

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న నేపథ్యంలో మానవ సేవే మాధవ సేవగా భావించిఓ వ్యక్తి తన జీవితాన్ని అనాథలకు అంకితం చేశాడు. తన సొంత డబ్బుతో పాటు దాతల సాయంతో గిద్దలూరు పట్టణం పీఆర్ కాలనీలో సంజీవిని అనాథ ఆశ్రమాన్ని స్థాపించి అందరి మన్ననలు పొందుతున్నాడు.

- ఆటో నడుపుతూ అనాథలకు అండగా ఆటో డ్రైవర్
- పేదరికంలోనూ వృద్ధులకు ఆశ్రమం నిర్వహణ



ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులు

గిద్దలూరు రూరల్:

వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓబులాపురం రాజశేఖర్ తన భాగం కింద వచ్చిన ఆస్తి 2.75 ఎకరాల పొలాన్ని విక్రయించాడు. వచ్చిన నగదు రూ.2.50 లక్షలతో 2021లో పట్టణంలోని సంజీవిని అనాథ ఆశ్రమం ప్రారంభించాడు. బతుకుదెరువు కోసం వృత్తిరీత్యా ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మరోవైపు సేవ చేయాలనే తపన ఉండటంతో అనాథలకు అండగా నిలిచాడు. ఆశ్రమంలో మొత్తం 15 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వారికి అన్నీ తానై దగ్గర ఉండి సేవలు అందిస్తున్నాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా వీధుల వెంట తిరిగే వారిని చేరదీసి వారికి తగిలిన గాయాలను సైతం నయం చేసేందుకు వైద్యం అందించి మరీ ఆశ్రమంలో చేర్చుకుంటున్నాడు. మతిస్థిమితం లేని కోటి అనే వ్యక్తి కాలికి తీవ్రగాయమై వీధుల వెంట తిరుగుతున్నాడు. గాయం నుంచి పురుగులు వస్తూ భయంకరంగా ఉన్నా గాయాన్ని సైతం పట్టుకుని శుభ్రం చేసి వైద్య సేవలు అందించి గాయాన్ని నయం చేశాడు. పట్టణానికి చెందిన శివరాత్రి మహేష్ అనే వ్యక్తి మత్తు పదార్థాలకు బానిసై పక్షవాతంతో పాటు అతడు మూగవాడయ్యాడు. అందరు ఉన్నా ఎవరూ లేని అనాథగా పట్టణంలోని కాశినాయన కుంట ఆవరణలో దిక్కుతోచని స్థితిలో పడి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ సమయంలో దుర్గంధంతో ఉన్న మహేష్‌ను రాజశేఖర్ అక్కున చేర్చుకుని సపరిచర్యలు చేసి మరీ ఆశ్రమానికి తీసుకెళ్లాడు. ఇదే తరహాలో అందరూ ఉండి అనాథలుగా మిగిలిపోయిన వారు కొందరు ఆశ్రమంలో ఉంటున్నారు. ఎక్కడైనా అనాథలు ఉన్నారని తెలిస్తే తన ఆశ్రమం వారికి అండగా ఉంటుందంటూ వారి వద్దకు వాలిపోతుంటాడు రాజశేఖర్. వృద్ధుల ఆశ్రమంతో పాటు మరో వైపు సంజివిని ఎడ్యుకేషన్ గురుకుల స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పది మంది చిన్నారులను చేరదీసి చదువు చెప్పిస్తున్నాడు. పిల్లల కంటే వృద్ధులకే ఎక్కువ సమయం కేటాయిస్తూ వారికి బాగాలేకపోతే దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్తున్నాడు.

**సేవలకు గుర్తింపు**

సంజీవిని అనాథ ఆశ్రమం ద్వారా రాజశేఖర్ చేస్తున్న సేవలను గుర్తించి పాండిచ్చేరిలో పేస్ యూనివర్సిటీ గతేడాది జూలై 15వ తేదీన రాజశేఖర్‌కు డాక్టరేట్ అందజేసి సత్కరించింది.



ఆశ్రమంలో వృద్ధురాలికి సేవలు చేస్తున్న రాజశేఖర్



వ్యాధికి గురైన వృద్ధుడికి సేవలందిస్తున్న రాజశేఖర్

**దాతల సహకారం కావాలి**

సంజీవిని అనాథ ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు తన రెండు చేతులతో ఎంత సేవ అయిన చేస్తానని, కానీ వారి అవసరాలకు సరిపడా డబ్బులు మాత్రం సమకూర్చేందుకు తనకు కష్టతరంగా మారుతోందని రాజశేఖర్ పేర్కొంటున్నాడు. తనతో పాటు తన భార్య విజయకుమారి సహకరిస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. తన కుటుంబ సభ్యులందరం కలిసి ఆశ్రమంలోనే తింటూ అక్కడే ఉంటున్నామని రాజశేఖర్ పేర్కొన్నాడు.




రాజశేఖర్‌కు ఇచ్చిన డాక్టరేట్ సర్టిఫికెట్

## కరవదిలో ఇరువర్గాల ఘర్షణ

ఒంగోలు టౌన్: మండలంలోని కరవదిలో ఘర్షణ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామంలోని తూర్పు హరిజనవాడకు చెందిన అమ్మాయిని అరుంధతి కాలనీకి చెందిన తరుణ్ మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అమ్మాయికి మేనమామ వరసయ్యే రాజశేఖర్ అప్పుడు తరుణ్‌పై ఆగ్రహంతో పరుష పదజాలంతో దూషించాడు. ఇది మనసులో పెట్టుకున్న తరుణ్.. బుధవారం రాత్రి అత్తవారింటికి వెళ్లి వస్తున్న క్రమంలో రాజశేఖర్ ఎదురయ్యాడు. మద్యం మత్తులో వున్న తరుణ్ అతడితో ఘర్షణ పడ్డాడు. ఈ విషయంలో ఇద్దరూ నెట్టుకున్నారు. ఘర్షణ పెరిగే సూచన కనిపించడంతో స్థానికులు సర్ది చెప్పి పంపించారు. మరుసటి రోజు గురువారం ఉదయం పచ్చాకు పనులకు ముఠా కూలీలను తీసుకొని తూర్పు హరిజనవాడకు చెందిన గొర్రెమచ్చు సురేష్ అరుంధతి కాలనీ మీదుగా ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. ఇది గమనించిన తరుణ్, అతడి తమ్ముడు సునిల్ ట్రాక్టర్ ఆపివేసి ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో గొర్రెమచ్చు సురేష్‌కు గాయాలయ్యాయి. అతడిని వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తాలుకా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని నిరసనకు దిగారు. ఇదిలా ఉండగా ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.


కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1వంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

ఋణగ్రహీత/తనఖాదారులు: (1). శ్రీమతి. షేక్ ఫాతిమ, భర్త: బాషా, డి.నెం. 10/709Z-22-D, నాగులవరం రోడ్డు, మర్కాపురం టౌన్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్- 523316. (2). శ్రీ. షేక్ షఫిఉల్లా అలియాస్ షఫీ, తండ్రి: అన్వర్ బాషా, డి.నెం. 10/709Z-22-D, నాగులవరం రోడ్డు, మర్కాపురం టౌన్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523316. హామీదారు: [illegible] 10-103-ఎ-3, జవహర్ నగర్ కాలనీ, 10వ వార్డు, మర్కాపురం టౌన్, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523316.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

[illegible]

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | ప్రస్తుత తేదీ నాటికి బకాయి మొత్తం వడ్డీతో | వడ్డీ రేటు |
|---|---|---|---|
| మార్టుగేజ్ లోన్ అకౌంట్ నెం. 36679830000030. | 13.04.2016 తేదీన రూ.4,95,000/- | రూ.1,56,291/- 31.10.2024 తేదీ నాటికి | 13.65% |

[illegible] ... 30.06.2021 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. ... 60 రోజులలోగా రూ.1,56,291/- ... సెక్షన్ 13(2) ... సెక్షన్ 13(4) ... SARFAESI చట్టం ... సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ... [illegible]

తనఖా / తాకట్టు ఉంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

[illegible] ... సర్వే నెం.323 లోని 117 చ.గ॥ లేదా 98.28 చ.మీ॥ ... 02.06.2011, డాక్యుమెంట్ నెం.4368/2011 ... [illegible]

తేది: 26.11.2024, ప్రదేశం: ఒంగోలు | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1వంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

[illegible]

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

[illegible] (13690) [illegible]

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | ప్రస్తుత తేదీ నాటికి బకాయి మొత్తం వడ్డీతో | వడ్డీ రేటు |
|---|---|---|---|
| ఎడ్యుకేషన్ లోన్ అకౌంట్ నెం. [illegible] | 26.06.2016 తేదీన రూ.17,00,000/- | రూ.10,81,285/- 28.11.2024 తేదీ నాటికి | [illegible] |

[illegible] ... 31.10.2019 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. ... SARFAESI చట్టం ... [illegible]

తనఖా / తాకట్టు ఉంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

[illegible]

తేది: 21.12.2024, ప్రదేశం: ఒంగోలు | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


# కలెక్టర్‌కు జేసీ, ఇతర అధికారుల శుభాకాంక్షలు



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ గోపాలకృష్ణ



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు శరత్, ఇతర నాయకులు

- జేసీకి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు
- నూతన సంవత్సరం నేపథ్యంలో కలెక్టరేట్‌లో సందడి



జేసీ గోపాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీటీసీ సుశీల



కలెక్టర్‌కు కేక్ తినిపిస్తున్న ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న, పక్కన డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు అర్బన్: కలెక్టర్ తమీమ్ అన్సారియాకు జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సరం నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో సందడి నెలకొంది. జనవరి 1వ తేదీ అనివార్యకారణాతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు వేడుకలకు దూరంగా ఉన్నారు. దీంతో ఇరువురి ఐఏఎస్ అధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు జిల్లా యంత్రాంగంతో పాటు పలు ఉద్యోగ సంఘాల నాయకులు తరలి వచ్చారు. కలెక్టరేట్‌లో సందడి వాతావరణం నెలకొంది. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు, పూలమాలతో నూతన సంవత్సర శుభాకంక్షలు తెలిపారు. డీఆర్‌ఓ ఓబులేసు, ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, సీపీఓ వెంకటేశ్వర్లు, డీటీసీ సుశీల, సైనిక వెల్ఫేర్ అధికారి రజని, టూరిజం అధికారి బెన్హర్, డీసీఓ రాజశేఖర్, డీఎస్‌ఓ పద్మశ్రీ, ఇతర అధికారులు, ఉద్యోగులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

## 247 మందిలో 188 మంది క్వాలిఫై

- కొనసాగుతున్న పోలీసు ఉద్యోగాల దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ



పరుగు పందేనికి సిద్ధమవుతున్న అభ్యర్థులు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ఉద్యోగాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షలకు 600 మందికి 247 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ పరీక్షలు చేశారు. అనంతరం సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ప్రత్యేక నిఘా మధ్య వీరికి 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల లాంగ్ జంప్ తదితర పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో 188 మంది క్వాలిఫై అయినట్లు అధికారులు తెలిపారు. 59 మంది మాత్రం డిస్‌క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగాలకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షలను పక్కాగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు తావు లేకుండా సీసీ కెమెరాలు, డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా దళారులు చెబితే నమ్మవద్దని, అలాంటి వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

# ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ



ప్రయాణికురాలికి పర్సు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

- పోగొట్టుకున్న పర్సును ప్రయాణకురాలికి అందజేత
- కండక్టర్ నిజాయితీని అభినందించిన ఆర్టీసీ అధికారులు

కనిగిరి రూరల్: ప్రయాణికురాలు పోగట్టుకున్న నగదు ఉన్న పర్సును తిరిగి అందజేసిన ఆర్టీసీ కండక్టర్ ఎం.మహేశ్వరిని డిపో మేనేజర్, సిబ్బంది గురువారం అభినందించారు. వివరాలు.. కనిగిరి డిపోకు చెందిన పామూరు సర్వీస్ బస్సులో పామూరు నుంచి కనిగిరికి వచ్చిన ప్రయాణికురాలు బస్సుల్లో పర్సును మరిచి పోయి దిగి వెళ్లిపోయింది. బస్సులో అందరూ దిగిన తర్వాత సీటులో పర్సు ఉండటాన్ని గమనించిన కండక్టర్ ఎం.మహేశ్వరి దాన్ని తీసుకుని డిపోలోని సమాచార కేంద్రంలో అందజేశారు. బస్సులో పర్సు పోగొట్టుకుని ప్రయాణికురాలు డిపోకు వచ్చి అధికారులను కలిసింది. కండక్టర్ వెంటనే కంట్రోలర్ వద్ద ఉన్నట్లు తెలిపింది. ఆర్టీసీ అధికారులు పూర్తి వివరాలు, సమచారం తెలుసుకుని ఆ పర్సు ప్రయాణికురాలిదిగా నిర్ధించారించారు. పర్సుతో పాటు అందులో ఉన్న రూ.9,500 నగదు, ఇతర వస్తువులను ప్రయాణికురాలికి అందజేశారు. ఆర్టీసీ కండక్టర్ ఎం.మహేశ్వరి నిజాయితీని అధికారులు అభినందించారు. డిపో మేనేజర్ మొహ్మద్ సయనా బేగం, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.కొండయ్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## దాడి కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

పామూరు: దాడి చేసి గాయపరిచిన కేసులో పామూరుకు చెందిన వ్యక్తికి కనిగిరి జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర ఆరు మాసాల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. వివరాలు.. 2017 ఆగస్టు 29వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో మండల కేంద్రం పామూరులో వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సందర్భంలో ఆకుల మోహనరావు మరికొంతమంది ఊరేగింపు చూసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. అదే సమయంలో కటకం రవి అనే వ్యక్తి వంకాయ బాంబును కాల్చగా ఆ నిప్పు రవ్వలు అక్కడ ఉన్న వారిపై పడ్డాయి. ఆకుల మోహన్‌రావు మరికొందరు జాగ్రత్తగా కాల్చమని కటకం రవికి చెప్పారు. ఊరేగింపు ముగించుకుని మోహన్‌రావు మరికొందరు తిరిగి వస్తుండగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగానే కటకం రవి.. మోహన్‌రావు ముఖంపై గట్టిగా కొట్టగా ఆయన పక్కనే ఉన్న టెలిఫోన్ స్తంభంపై పడి గాయాలయ్యాయి. దీనిపై క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దార్యాప్తు చేశారు. దీనిపై విచారణ జరుగుతుండగా కేసు రుజువైనందును నిందితుడు కటకం రవికి కనిగిరి జేఎఫ్‌సీయం న్యాయవాది భరత్‌చంద్ర జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై కిషోర్ బాబు తెలిపారు.

## మద్యం షాపు ప్రాంగణంలో తాగితే చర్యలు

- ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు

సాక్షి ఎఫెక్ట్..




సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం

వేటపాలెం: మద్యం షాపుల ప్రాంగణంలో తాగితే చర్యలు తీసుకుంటామని ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సోమిశెట్టి రామారావు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని మద్యం షాపులను తనిఖీ చేశారు. మద్యం దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారని ఈ నెల 2వ తేదీన సాక్షి దినపత్రికలో ‘బార్‌లా మద్యం దుకాణాలు’ అనే కథనాన్ని ప్రచురించింది. ఇందుకు ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు మాట్లాడుతూ వేటపాలెంలో మద్యం షాపుల తనిఖీ సమయంలో దుకాణం ప్రాంగణంలో మద్యం తాగుతునట్లు కనిపించ లేదని పేర్కొన్నారు. పత్రికలో వచ్చిన కథనం మేరకు గ్రామంలో మద్యం షాపులను తనిఖీ చేశామన్నారు. షాపు నుంచి మద్యం కొనుగోలు చేసుకొని వెళ్లి పోవాల్సిందే తప్ప ప్రాంగణంలో ఎటంటి సిట్టింగులకు అనుమతి లేదన్నారు. మేము త్వరలో ఆకస్మిక దాడులు జరుపుతామని, అప్పుడు ప్రాంగణంలో మద్యం తాగుతున్నట్లు కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం షాపు నడుపుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని షాపు యజమానులకు సూచించామని చెప్పారు. ప్రస్తుతం అంతా బాగానే ఉందన్నారు.

# దర్శిలో కూత వేసిన రైలు



దర్శిలో ఆగిన రైలు




వివరాలు తెలుసుకుంటున్న రైల్వే అధికారులు, పట్టణ ప్రజలు

- ట్రయల్ రన్ నిర్వహించిన రైల్వే అధికారులు

దర్శి: నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌పై గురువారం దర్శి వరకు ప్యాసింజర్ రైలు బండిని రైల్వే అధికారులు ట్రయల్ రన్ వేశారు. దర్శి రైల్వేస్టేషన్‌లో వసతులు, రైలు బండి నడిచేందుకు ఉన్న సౌకర్యాలను అధికారులు పరిశీలించారు. ఈ విషయం తెలిసి రైలు బండి చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వారిని రైల్వే అధికారులు పలకరించి అవసరాలు అడిగి తెలుసుకున్నారు.


సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

- B.Tech (ALL) మరియు డిగ్రీ, Bsc నర్సింగ్ మరియు GNM, ANM పూర్తి చేసినవారు కావలెను సెల్ 78427 71277 [SCA25001024]
- ఒంగోలు లోని శ్రీరత్నశ్రీ మెడికల్ షాప్ లో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన లేదా న్యూ బాయ్స్ కావలెను ✆ 99665 81651. [SCA24000963]
- AP& తెలంగాణలోని అన్ని జిల్లాలు మండలాల నందు యువరాజ్ ఎంటర్ ప్రైజెస్ & ఫైనాన్స్ నందు జాబ్ చేయుటకు మేనేజర్స్ -30, SM-150, ASM-150, రిసెప్షనిస్టులు -120 కావలెను. జీ॥ 15k+15k, 10k, & 7k. సంప్ర॥ ✆ 90149 14193, 91002 90236. [O-190068]
- రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe.జీ+కమీషన్+2వీలర్+రూం+భో ఫ్రీ, Age : 30, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15242]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.